క్లుప్తంగా

వైభవంగా వీరబ్రహ్మేంద్ర స్వామి గ్రామోత్సవం



పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి, గోవిందమాంబ ఉత్సవ మూర్తులు

గూడూరు రూరల్ : గూడూరు మండలం చెన్నూరు గ్రామంలో బుధవారం రాత్రి దేవాంగ సంఘం ఆధ్వర్యంలో పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి, గోవిందమాంబ గ్రామోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలను 84 ఏళ్లుగా ప్రతి ఏటా నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. గురువారం మధ్యాహ్నం ఆలయం వద్ద పెద్ద ఎత్తున అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, దేవాంగ సంఘం జిల్లా కార్యవర్గ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం



భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంఈవో, ఎంపీడీవోలు

సైదాపురం : విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఎంపీడీవో పురుషోత్తం శివకుమార్, ఎంఈవో సుప్రియ ఆదేశించారు. వారు గురువారం సైదాపురం ఎంఎస్ కాలనీలోని పాఠశాలను తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనం రుచి చూశారు. వారు మాట్లాడుతూ మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం పెట్టాలన్నారు. అనంతరం అనంతమడుగు గ్రామ సచివాలయాన్ని తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు.

పన్నులు వంద శాతం వసూలు చేయాలి



సచివాలయాల సిబ్బందితో సమీక్షిస్తున్న ఆర్డీ, కమిషనర్

నాయుడుపేట టౌన్ : మున్సిపాలిటీల్లో పన్నులను వందశాతం వసూలు చేయాలని గుంటూరు రీజనల్ డైరెక్టర్ సూర్య దేవర హరికృష్ణ ఆదేశించారు. ఆయన గురువారం నాయుడుపేట మున్సిపల్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. అనంతరం వార్డు సచివాలయాల సిబ్బందితో సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీల పన్నులు, దుకాణాల లీజు బకాయిలపై ఆరా తీశారు. ఇంటి పన్నుల వసూలుకు ప్రత్యేక డ్రైవ్ చేపడుతున్నట్లు కమిషనర్ షేక్ ఫజులుల్లా ఆర్డీకి వివరించారు.

ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడిగా కోటా



నాయుడుపేట టౌన్ : నాయుడుపేట ఆర్యవైశ్య సంఘం నూతన అధ్యక్షుడిగా కోటా వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శిగా మెంటా మల్లికార్జున ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. ఆ సంఘం గౌరవ అధ్యక్షుడు పెసల రాజగోపాల్ ఆధ్వర్యంలో గురువారం సంఘం సభ్యులు, కుల పెద్దలు నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఆర్యవైశ్య సంఘం తిరుపతి, నెల్లూరు జిల్లాల రూరల్ అధ్యక్షులు కనమర్లపూడి సుబ్రహ్మణి, గూడూరు కిషోర్ కుమార్, రాష్ట్ర యువజన సంఘం ఉపాధ్యక్షులు గూడూరు కిరణ్ కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి గాదంశెట్టి నాగరాజు తదితరులు వారిని అభినందించారు.

కారు టైర్ల చోరీ



పెళ్లకూరు : నాయుడుపేట-పూతలపట్టు జాతీయ రహదారిలో ఈ నెల 15న కారురోడ్డు ప్రమాదానికి గురైంది. దాని టైర్లను బుధవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. హైదరాబాద్‌కు చెందిన దంపతులు ఈ నెల 15న తిరుమల శ్రీవారిని దర్శించుకుని తిరిగి కారులో స్వగ్రామం బయలుదేరారు. మార్గమధ్యంలో పెళ్లకూరు మండలం దొడ్లవారిమిట్ట గ్రామం వద్ద ఆగివున్న లారీని కారు ఢీకొంది. దంపతులిద్దరు దుర్మరణం చెందారు. ప్రమా దానికి గురైన కారును పోలీసులు చిల్లకూరు సమీపంలో రోడ్డు పక్కన వదిలిపెట్టారు. ఈ క్రమంలో గుర్తు తెలియని వ్యక్తులు కారుకున్న మూడు టైర్లను చోరీ చేశారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి నిందితులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

శాస్త్రోక్తంగా లింగోద్భవ పూజలు

వరదయ్యపాళెం: మండలంలోని పాండూరు జ్యోతీశ్వరాలయంలో మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా గురువారం వేకువజామున లింగోద్భవ పూజలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారికి మహన్యాస పూర్వక అర్చన, బిల్వార్చన, లింగోద్భవ పూజ చేశారు. భక్తులు రాత్రి ఆలయం వద్ద జాగరణ చేశారు. ఆలయ అర్చకులు నిరంజనాచార్యులు, ధర్మకర్త నందకుమార్ నాయుడు భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.

ఆగని గ్రావెల్ అక్రమ రవాణా

కూటమి నేతలు అధికారం అండతో రెచ్చిపోతున్నారు. మమ్మల్ని ఎవరు అడ్డుకునేదంటూ యథేచ్ఛగా అక్రమాలకు పాల్పడుతున్నారు. దొరవారి సత్రం మండలం నుంచి ఇతర ప్రాంతాలకు గ్రావెల్ తరలిస్తూ రూ.లక్షలు ఆర్జిస్తున్నారు. ఈ విషయం తెలిసినా మైనింగ్, రెవెన్యూ, పోలీసు అధికారులు చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారు. ఇంటి అవసరాల కోసం కొంత గ్రావెల్ తవ్వుకుంటే కేసులు నమోదు చేసే అధికారులు బడా బాబులపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



గ్రావెల్ లోడ్ చేసుకోవడానికి వెళుతున్న టిప్పర్ లారీలు

- రాత్రికి రాత్రే టిప్పర్ల ద్వారా తరలిపోతున్న గ్రావెల్
- రెచ్చిపోతున్న మాఫియా
- అండగా నిలుస్తున్న నియోజకవర్గ ప్రజాప్రతినిధి



టిప్పర్ లారీకి గ్రావెల్ లోడ్ చేస్తున్న జేసీబీ యంత్రం

దొరవారిసత్రం : మండలంలోని పూలతోట గ్రామ రెవెన్యూ పరిధిలోని పూలతోటమిట్ట సమీపంలో సర్వే నంబరు 301 నుంచి 314 వరకు 80 ఎకరాల అసైన్డ్ భూములు ఉన్నాయి. వాటిలో నాణ్యమైన గ్రావెల్ ఉంది. దీనిపై కూటమి నేత కన్నేశాడు. అతనికి నియోజకవర్గ ప్రజాప్రతినిధి అండ ఉండడంతో అధికారులను లోబరుచుకుని గ్రావెల్ అక్రమ తవ్వకాలకు తెరలేపాడు. భారీ యంత్రాలతో గ్రావెల్ తవ్వి టిప్పర్లలో లోడు చేసి సూళ్లూరుపేట, నాయుడుపేట, తడ తదితర ప్రాంతాల్లోని పరిశ్రమలు, ప్రైవేట్ లేఅవుట్లకు తరలించడం మొదలుపెట్టాడు. దీన్ని స్థానికులు అడ్డుకున్నారు. అంతేగాక జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో గ్రావెల్ తవ్వుతున్న ప్రాంతాన్ని సూళ్లూరుపేట ఆర్డీవో కిరణ్మయి పరిశీలించారు. రెండు హిటాచీలను సీజ్ చేసి పోలీసులకు అప్పగించారు. ఇటీవల తహసీల్దార్ శైలకుమారి కూడా ఆ ప్రాంతాన్ని పరిశీలించి గ్రావెల్ అక్రమ తవ్వకాలపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కొద్ది రోజులు స్తబ్దుగా ఉన్న బడా నేత మళ్లీ రెచ్చిపోతున్నాడు. రాత్రిళ్లు గుట్టుచప్పుడు కాకుండా గ్రావెల్ తరలించడం మొదలుపెట్టాడు. మంగళవారం రాత్రి సుమారు 30 టిప్పర్ల ద్వారా గ్రావెల్‌ను సూళ్లూరుపేట, నాయుడుపేటకు తరలించినట్టు స్థానికులు ఆరోపిస్తున్నారు. భారీ వాహనాల్లో గ్రావెల్ తరలిస్తుండడంతో పూలతోటమిట్ట-డీవీ సత్రం ఆర్అండ్‌బీ రోడ్డు దెబ్బతిని గుంతలు పడ్డాయని వాపోతున్నారు. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి గ్రావెల్ అక్రమ రవాణాను అరికట్టాలని కోరుతున్నారు.

భక్తులకు అన్నదానం

కోట: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని కోటలో గురువారం కామాక్షీదేవి సమేత సోమేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు, అన్నాభిషేకం నిర్వహించారు. అనంతరం శివసేవా సంఘం ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. కార్యక్రమంలో విశ్వనాథం, వాసు, బాలక్రిష్ణ సింగ్, మహేంద్ర, ఉపసర్పంచ్ గాది భాస్కర్ పాల్గొన్నారు.

వెంకటగిరిలో..

వెంకటగిరి రూరల్ : మహాశివరాత్రి పండుగ సందర్భంగా వెంకటగిరిలోని రామలింగేశ్వరస్వామి, వల్లివేడు క్రాస్ రోడ్డు సమీపంలోని భ్రమరాంబ మల్లికార్జున స్వామి, బంగారుపేటలోని భవాని శంకరాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

సైదాపురంలో ఏడు ధాన్యం కొనుగోలు కేంద్రాలు

సైదాపురం: మండలంలోని అనంతమడుగు, చీకవోలు, సైదాపురం, తురిమెర్ల, రామసాగరం, తుమ్మల తలుపూరు, గిద్దలూరు గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు ఏవో హైమావతి తెలిపారు. రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

సీహెచ్‌సీ భవనం ప్రారంభం

వాకాడు : మండల కేంద్రమైన వాకాడు ఎన్‌టీకేఆర్ ఆస్పత్రి ప్రాంగణంలో గత ప్రభుత్వంలో నిర్మించిన సామాజిక ఆరోగ్య కేంద్ర భవనాన్ని గురువారం గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ పేదలకు కార్పొరేట్ వైద్యం అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కార్యక్రమంలో వైద్యులు, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

రీ సర్వేపై అవగాహన ర్యాలీ



అవగాహన ర్యాలీలో పాల్గొన్న సబ్ కలెక్టర్, తదితరులు

చిల్లకూరు : మండలంలోని కడివేడు గ్రామ రెవెన్యూ పరిధిలోని భూముల రీ సర్వేకు రెవెన్యూ అధికారులు సిద్ధమయ్యారు. ఈ క్రమంలో గ్రామంలో గురువారం అవగాహన ర్యాలీ చేపట్టారు. గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్రమీనన్ మాట్లాడుతూ కడివేడు రెవెన్యూ పరిధిలోని భూముల వివాదాలపై ప్రతి రోజూ వినతులు వస్తున్నాయని తెలిపారు. వాటికి చెక్ పెట్టేందుకు రీ సర్వే చేస్తున్నట్టు తెలిపారు. ముందుగా ఒక వారంలో గ్రామ సభ నిర్వహించి ప్రజల అభిప్రాయాలను సేకరిస్తామని తెలిపారు. తర్వాత ఐదు బృందాలను ఏర్పాటు చేసి ప్రతి సర్వే నంబర్‌లోని భూములు, సాగులో ఉన్న వారి వివరాలను సేకరించి ఎల్‌పీ నంబర్ ఇస్తామని వివరించారు. అనంతరం ప్రభుత్వ భూమి ఎంత ఉంది అనే విషయాన్ని రికార్డుల్లో పొందుపరుస్తామని చెప్పారు. తహసీల్దార్ శ్రీనివాసులు, సర్వేయర్ మల్లికార్జున్, ఆర్ఐ పూర్ణ, వీఆర్వో బాలాజీ, నాయకులు పాల్గొన్నారు.

దారి ఆక్రమణపై ఫిర్యాదు

కలువాయి: కలువాయి అరుంధతీయవాడలోని ఆంజనేయస్వామి గుడి పక్కవీధిలో దారి ఆక్రమణపై స్థానికులు గురువారం తహసీల్దారు, ఎంపీడీవోకు ఫిర్యాదు చేశారు. కొందరు మంచినీటి బావికి పక్కనున్న స్థలాన్ని ఆక్రమించుకుని ఇంటి నిర్మాణం చేస్తున్నారని తెలిపారు. మరొకరు దుకాణం ఏర్పాటుచేసుకున్నారని పేర్కొన్నారు. దీంతో 30 కుటుంబాల వారు ఇబ్బంది పడుతున్నట్లు తెలిపారు. వాటిని తొలగించాలని కోరారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

కోట : కాలిన గాయాలతో చికిత్స పొందుతూ కోటకు చెందిన నిర్మలమ్మ(60) గురువారం మృతి చెందినట్లు ఎస్ఐ పవన్‌కుమార్ తెలిపారు. కోటకు చెందిన విశ్రాంత హెచ్ఎం ఆశం సిద్దేశ్వరరావు సతీమణి నిర్మలమ్మ ఈ నెల 14న ఇంట్లో తులసి చెట్టు వద్ద దీపం వెలిగించారు. ప్రదక్షిణలు చేస్తుండగా చీరకు నిప్పు అంటుకుంది. తీవ్రంగా గాయపడిన ఆమెను కుటుంబ సభ్యులు నెల్లూరులోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. ఈ క్రమంలో పరిస్థితి విషమించి ఆమె గురువారం మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు. ఆమె మృతదేహంపై పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

కార్పొరేట్‌కు దీటుగా గురుకుల విద్యార్థులు రాణించాలి



మాట్లాడుతున్న జిల్లా అధికారిణి ఎస్తేరు గీత

నాయుడుపేట టౌన్ : గురుకుల పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు కార్పొరేట్ పాఠశాలలు, కళాశాలకు దీటుగా రాణించాలని తిరుపతి, చిత్తూరు జిల్లాల గురుకుల పాఠశాలల అధికారిణి ఎం.ఎస్తేరు గీత ఆకాంక్షించారు. నాయుడుపేట పట్టణంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలుర గురుకుల పాఠశాల విద్యార్థులకు గురువారం అమవరపు సత్యం పరీక్ష ప్యాడ్లు, విద్య సామగ్రి అందజేశారు. ఇందులో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ గురుకులం పాఠశాలలు, కళాశాలల్లో చదువుతున్న ఇంటర్, 10 తరగతి విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించాలన్నారు. తిరుపతి, చిత్తూరు జిల్లాల్లోని గురుకులాల్లో చదువుతున్న విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించినట్టు తెలిపారు. అనంతరం గురుకులంలో నిర్మిస్తున్న మరుగుదొడ్లు, వంటశాల, భోజనశాల, రికార్డులను పరిశీలించారు. మెనూ ప్రకారం భోజనం పెట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో గురుకుల ప్రిన్సిపాల్ దాదాఫీర్, వైస్ ప్రిన్సిపాల్ నాగేశ్వరరావు, రాష్ట్ర హెల్త్ సూపర్‌వైజర్ సుధాకర్, బందిలి శేఖర్ బాబు, మోహన్‌రాజు, రాజశేఖర్, వెంకటరమణయ్య తదితరులు పాల్గొన్నారు.

సేవా దృక్పథాన్ని అలవరుచుకోవాలి



జ్ఞాపికలు అందజేస్తున్న జిల్లా గవర్నర్ గౌతం

గూడూరు రూరల్ : ప్రతి ఒక్కరూ సేవా దృక్పథాన్ని అలవరచుకోవాలని లయన్స్ క్లబ్ జిల్లా గవర్నర్ గౌతం కోరారు. గూడూరు పట్టణంలోని నెల్‌క్యాస్ట్ కాలనీకి గురువారం రవిచంద్ర, కల్యాణ సాయి, రామ్మూర్తి దాతృత్వంతో బోర్ మోటారు, 3 బెంచీలు అందజేశారు. అదే విధంగా గూడూరు జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులకు పంచాయతీ రాజ్ శాఖ విశ్రాంత ఎస్ఈ కాంతారావు దాతృత్వంతో క్రీడా దుస్తులు, సరస్వతీ శిశుమందిరంలో నిరుపేదలకు నెలకు సరిపడా సరుకులు, ఇద్దరు మహిళలకు జీవనోపాధి కోసం కుట్టు మిషన్లు అందజేశారు. బాలసదనంలో డీఈ కృష్ణబాబు దాతృత్వంతో 36 మంది బాలికలకు దుస్తులు అందజేశారు. అలాగే బాలాజీ దాతృత్వంతో పౌష్టికాహారం పంపిణీ చేశారు. అనంతరం క్రీడల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ చైర్మన్ షేక్ రియాజ్ అహ్మద్, ఎం.మురళీరెడ్డి, వాకాటి రామ్మోహన్, శీనయ్య, రూపేష్‌రెడ్డి, ఎం.రమణయ్య, కె.శివయ్య, వీరేంద్రనాథ్, హనుమంతరావు పాల్గొన్నారు.

హంస వాహనంపై ప్రసన్న వేంకటేశ్వరుడు

రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్): శ్రీకాళహస్తి మండలంలోని తొండమాన్ పురంలోని టీటీడీ అనుబంధ శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా గురువారం రాత్రి ఉభయదేవేరులతో స్వామి వారు హంస వాహనంపై విహరిస్తూ భక్తులను కటాక్షించారు. ఉదయం సుప్రభాతంతో స్వామిని మేల్కొలిపి నిత్య కైంకర్యాలు చేపట్టారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. తదుపరి ఉత్సవమూర్తులను అభిషేక మండపానికి తీసుకువచ్చారు. నడుమ అభిషేకం, అలంకారం చేశారు. సాయంత్రం ఉయ్యాల సేవ నిర్వహించారు. రాత్రి హంస వాహనంపై శ్రీదేవి భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆశీనులై విహరించారు.

మార్కెట్‌లో రుసుము వసూలుకు వేలం పాటలు



వేలం పాటలు నిర్వహిస్తున్న కమిషనర్ షేక్ ఫజులుల్లా

నాయుడుపేట టౌన్ : నాయుడుపేట మున్సిపాలిటీలోని కూరగాయలు, చేపలు, మాంసం విక్రయ మార్కెట్లలో రుసుము వసూలు హక్కు కోసం గురువారం మున్సిపల్ కార్యాలయంలో వేలం పాటలు నిర్వహించారు. కమిషనర్ షేక్ ఫజులుల్లా మాట్లాడుతూ కూరగాయల మార్కెట్‌లో దినసరి రుసుము వసూలుకు ఏడాదికి రూ.12,30,127లు, చేపలు, మాంసం మార్కెట్‌కు రూ.4.75 లక్షలు, తోపుడు బండ్ల నుంచి రుసుము వసూలుకు రూ.2.11 లక్షలు, బస్టాండులో వాహనాల నుంచి రుసుము వసూలుకు రూ.1.33 లక్షలకు వేలంలో దక్కించుకున్నట్టు తెలిపారు. అదే విధంగా సీకేఎం దుకాణాల సముదాయంలో 2, 3, 8 నంబర్ల దుకాణాలను వేలంలో పాడుకున్నట్టు పేర్కొన్నారు. కూరగాయల మార్కెట్ సముదాయంలో 2వ నంబరు దుకాణానికి వేలం పాటకు ఎవరూ ముందుకు రాలేదని, దానికి మరోసారి వేలం పాటలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ రఫీ తదితరులు పాల్గొన్నారు.

లారీ ఢీకొని ఒకరికి గాయాలు

రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్): రేణిగుంట మండలంలో గురువారం ఆటోను లారీ ఢీకొనడంతో డ్రైవర్ తీవ్రంగా గాయపడ్డాడు. గాజులమండ్యం పోలీసుల కథనం మేరకు.. వెంకటగిరికి చెందిన నాగరాజు శివరాత్రి పండుగ సందర్భంగా తన కుటుంబ సభ్యులతో కలిసి బుధవారం హరికృష్ణ ఆటోలో పుత్తూరు సమీపంలోని మూలకంద్రిగ ఆలయానికి వెళ్లాడు. గురువారం తిరుగు ప్రయాణమయ్యాడు. రేణిగుంట సమీపంలోని నూతన జాతీయ రహదారి కూడలి వద్ద రేణిగుంట నుంచి పుత్తూరు వైపు వెళ్తున్న భారీ లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆటో డ్రైవర్ హరికృష్ణకు గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న గాజులమండ్యం పోలీసులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. ఆటో డ్రైవర్‌ను ఆస్పత్రికి తరలించేందుకు 108 వాహనానికి ఫోన్ చేసినా ఫలితం లేకపోవడంతో స్థానిక ఆటోలో తిరుపతి రుయా హాస్పిటల్ కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆటోను ఢీకొన్న కారు

- కాజ్‌వే నుంచి స్వర్ణముఖి నదిలో బోల్తాపడిన ఆటో
- ఆటో డ్రైవర్‌కు గాయాలు



స్వర్ణముఖి నదిలో పడిపోయిన ఆటో

నాయుడుపేట టౌన్ : నాయుడుపేట పట్టణంలోని స్వర్ణముఖి నది కాజ్‌వే వద్ద గురువారం కారు వేగంగా వచ్చి ముందు వెళుతున్న ఆటోను ఢీకొంది. దీంతో ఆటో కాజ్‌వే పై నుంచి నదిలోకి బోల్తా కొట్టింది. ఆటో డ్రైవర్ గాయపడ్డాడు. ఓజిలి మండల మాచవరం గ్రామానికి చెందిన రవివర్మ ఆటోలో నాయుడుపేటకు వచ్చి తిరిగి స్వగ్రామానికి స్నేహితుడితో కలిసి బయలుదేరాడు. నాయుడుపేట సమీపంలోని స్వర్ణముఖి నది కాజ్‌వే వద్ద వెనుక నుంచి కారు ఢీకొంది. దీంతో ఆటో కాజ్‌వే పైనుంచి స్వర్ణముఖి నదిలోకి బోల్తాపడింది. రవివర్మ గాయపడ్డాడు. అతన్ని స్థానికులు పట్టణంలోని ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. రవివర్మ స్నేహితుడికి గాయాలు కాలేదు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



చికిత్స పొందుతున్న ఆటో డ్రైవర్ రవివర్మ

కనుల పండువగా కల్యాణోత్సవం



నాయుడుపేట టౌన్ : నీలకంఠేశ్వరస్వామి కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు



సైదాపురం: ఊరేగుతున్న శివపార్వతులు

నాయుడుపేట టౌన్ : మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా నాయుడుపేట పట్టణంలోని బ్రాహ్మణ వీధిలో వెలసిన అన్నపూర్ణేశ్వరీదేవి సమేత కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో శివపార్వతుల కల్యాణాన్ని కనుల పండువగా నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. రాత్రి స్వామి, అమ్మవార్ల నగరోత్సవాన్ని వైభవంగా చేపట్టారు. స్వర్ణముఖి నది ఒడ్డున ఉన్న ప్రసూనాంబ సమేత నీలకంఠేశ్వరస్వామి, తిమ్మాజికండ్రిగ సమీపంలోని దుర్గామల్లేశ్వరి దేవి ఆలయాల్లో ప్రత్యేక హోమాలు చేశారు.

సైదాపురంలో..

సైదాపురం : శివరాత్రి పండుగ సందర్భంగా బుధవారం రాత్రి శివపార్వతుల గ్రామోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సైదాపురంలో గాండ్ల సంఘం ప్రతినిధులు ఏర్పాట్లు చేశారు. తురిమెర్ల గ్రామంలోనూ గ్రామోత్సవాన్ని చేపట్టారు.

నగరేశ్వర స్వామి కల్యాణం.. కమనీయం

చిట్టమూరు : మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా గురువారం మండలంలోని యాకసిరిమిట్టలో వెలసిన కామాక్షి సమేత నగరేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం స్వామి, అమ్మవార్ల కల్యాణాన్ని కనుల పండువగా నిర్వహించారు. ఉదయం సుప్రభాతంతో స్వామి, అమ్మవార్లను మేల్కొలిపి నిత్య కైంకర్యాలు చేశారు. అనంతరం విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. సాయంత్రం స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను కల్యాణ మండపంలోకి తీసుకువచ్చారు. వేద పండితులు శాస్త్రోక్తంగా కల్యాణం నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి మొక్కులు చెల్లించారు. ఈ కార్యక్రమానికి ఉభయకర్తలుగా వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు సన్నారెడ్డి శ్రీనివాసులురెడ్డి, సరిత దంపతులు వ్యవహరించారు.



చిట్టమూరు : నగరేశ్వర స్వామి కల్యాణ మహోత్సవంలో పాల్గొన్న ఉభయకర్తలు, భక్తులు

అడిగిన వారికి పనులు కల్పించాలి



క్షేత్ర సహాయకులతో సమీక్షిస్తున్న ఏపీవో గిరిబాబు

చిల్లకూరు : ఉపాధి హామీ పథకం కింద అడిగిన వారందరికీ పనులు కల్పించాలని ఏపీవో గిరిబాబు ఆదేశించారు. ఆయన గురువారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మండలంలోని ఉపాధి హామీ క్షేత్ర సహాయకులతో సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ మండలంలో ప్రతి కూలీకి 100 రోజులు పనులు కల్పించాలన్నారు. అలా కాకుండా కూలీలకు పనులు కల్పించకపోతే సంబంధిత క్షేత్ర సహాయకుడిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కొత్తగా గ్రామాల్లో ఫిష్ పాండ్లు ఏర్పాటు చేస్తున్నామని, చెరువుల్లో ఆయా రైతులు, చేపల పెంపకం చేసుకునే వారితో చర్చించి వారికి ఎక్కడ అనువుగా ఉంటుందో అక్కడ పనులు చేపట్టాలని సూచించారు.

కండలేరులో 51.938 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో గురువారం నాటికి 51.938 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. కండలేరు నుంచి సత్యసాయి గంగ కాలువకు 620, పిన్నేరు కాలువకు 120, లోలెవల్ కాలువకు 210, హైలెవల్ కాలువకు 210, మొదటి బ్రాంచ్ కాలువకు 70 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు.